క్లుప్తంగా

హిందీ పరీక్షలు ప్రారంభం



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే హిందీ వార్షిక పరీక్షలు శనివారం స్థానిక సర్వోదయ స్కూల్‌లో ప్రారంభమయ్యాయి. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల నుంచి 73 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటిరోజు ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు జరిగాయని పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ వైవీ రమణమూర్తి తెలిపారు. హిందీ ప్రచార సభ ప్రచారక్ రేపాక రఘునందన్ పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

విస్సన్నపేట: పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పనులు ఆపి శనివారం నిరసన తెలిపారు. బకాయి ఉన్న వేతనాలు చెల్లించక పోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ వేతనాలు త్వరలో చెల్లించేలా చూస్తామని పాలకవర్గ సభ్యులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

తిరువూరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం తిరువూరు వాహినీ ఇంజినీర్స్ కళాశాలలో ఇంజినీర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్ మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, వాహినీ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుత సమాజంలో ఇంజినీరింగ్ విద్యకు ఉన్న ప్రాధాన్యతను కళాశాల కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు వివరించారు. అనంతరం కళాశాలలో ఇంజినీర్లను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

రైతులను ఆదుకోవాలి

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): వరద ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిలుకూరు, దాములూరు గ్రామాల్లో దెబ్బతిన్న వ్యవసాయ పంటలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎకరాకు కనీసం రూ.30 వేలు ఇవ్వాలని, పశువులకు, వ్యవసాయ మోటార్లకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాలకు రక్షణ

డాక్టర్ కోలా విజయ్‌శేఖర్



జూపూడి(ఇబ్రహీంపట్నం): అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని ప్రముఖ వైద్యుడు కోలా విజయ్‌శేఖర్ తెలిపారు. జూపూడి నిమ్రా ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ప్రథమ చికిత్సపై జరిగిన అవగాహన సదస్సులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన చికిత్స అందేవరకు ప్రథమ చికిత్స ప్రాణాపాయం నుంచి రక్షిస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించి డెమో నిర్వహించారు. ప్రిన్సిపాల్ జనార్దన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నష్టం

నూజివీడు: ప్రకృతి విలయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సామాన్య, మధ్య తరగతి ప్రజలు, రైతులు ఆర్థికంగా కోలుకోలేనంత దెబ్బతిన్నారని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ అన్నారు. వెలగలేరు వద్ద బుడమేరు లాకులు ఎత్తగానే ప్రజలను అప్రమత్తం చేసినట్లయితే ఎవరికి వారు కొంతమేరకైనా విలువైన సామగ్రిని కాపాడుకోగలిగే వారన్నారు. వరి, పసుపు, కంద, అరటి, పత్తి అన్ని పంటలకు పూర్తి నష్టపరిహారం అందించాలని, తిరిగి పంటలు వేసుకునేందుకు ఆర్థిక సాయం అందజేయాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పంట పొలాల్లో ఇసుక మేటలు

- వరి, పత్తి, మినుము పంటలకు నష్టం
- మళ్లీ పంటల సాగుకు అవకాశం లేదు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి

నూజివీడు: ఈ ఏడాది కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు ఉపక్రమించిన రైతులకు అకాల వర్షంతో ఆదిలోనే హంసపాదు ఎదురైంది. భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చడం, చెరువులు పొంగి గండ్లు పడటంతో నియోజకవర్గంలో రైతులు సాగు చేసిన వరి, పత్తి, మినుము పంటలు దెబ్బతిన్నాయి. నూజివీడు పట్టణంలోని పెద్దచెరువుకు గండ్లు పడటంతో చెరువు కింద 100 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. మీర్జాపురం, మర్రిబంధం, గొల్లపల్లి, ఆగిరిపల్లి మండలంలోని ఆగిరిపల్లి, చిన్నాగిరిపల్లి, గోపాలపురం తదితర ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన మినుము అధిక వర్షాలకు దెబ్బతినడంతో నష్టం వాటిల్లింది. పొలాల్లో మేట వేసిన ఇసుక, మట్టిని తొలగించడం తలనొప్పిగా తయారైందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు కనీసం రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే మేట వేసిన ఇసుక, మట్టిని తొలగించేందుకు అదనంగా పరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దెబ్బతిన్న పంటల స్థానంలో మళ్లీ పంటలు సాగు చేసే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎకరాకు ఇస్తానన్న రూ.10 వేలు దేనికీ సరిపోవని రైతులు వాపోతున్నారు.



భారీ వర్షాలకు పంట పొలాల్లో వేసిన ఇసుక మేట



నూజివీడు పెద్ద చెరువుకు గండిపడటంతో కొట్టుకుపోయిన వరి పైరు

నియోజకవర్గంలో నష్టం అంచనా వివరాలు

నూజివీడు మండలంలో మినుము 784 ఎకరాలు, వరి 175 ఎకరాలు, పత్తి 55 ఎకరాలు, ఆగిరిపల్లి మండలంలో మినుము 750 ఎకరాలు, వరి 150 ఎకరాలు, పత్తి 70 ఎకరాలు, ముసునూరు మండలంలో మినుము 46 ఎకరాలు, వరి 31 ఎకరాలు, వేరుశనగ 6.50 ఎకరాలు, పెసర 4 ఎకరాలు, పత్తి 3 ఎకరాలు, చాట్రాయి మండలంలో మినుము 5 ఎకరాలు, వరి 13 ఎకరాలు, పత్తి 3 ఎకరాలు, మొక్కజొన్న 3 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

ఆరు ఎకరాల్లో వరికి నష్టం



పెద్దచెరువు కింద ఆరు ఎకరాల్లో వరిపంట సాగుచేశాం. దీనికి రూ.80 వేలు పెట్టుబడి అయింది. చెరువుకు గండ్లు పడి వరద నీరంతా పొలం మీదుగా వెళ్లడంతో పంట కొట్టుకుపోయింది. వరి పొలంలో ఇసుక, మట్టి మేటలు వేసింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– దాసరి సత్యనారాయణ(చంటి), కోనేరుపేట, నూజివీడు

మినుము పంటకు నష్టం



25 ఎకరాలు కౌలుకు తీసుకుని మినుము పంట సాగు చేశా. దీనికి రూ.5 లక్షల పెట్టుబడి అయింది. గత నెల కురిసిన అధిక వర్షాలకు పూత దశలో ఉన్న మినుము పంటంతా నీట మునిగి దెబ్బతింది. అధికారులు వచ్చి చూసి వెళ్లారే గాని ఇంత వరకు పంట నష్టంపై ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చెన్ను శ్రీనివాస్, కృష్ణవరం, ఆగిరిపల్లి మండలం

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వసంత పర్యటన

జి.కొండూరు: మండల పరిధిలోని పులివాగు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శనివారం పర్యటించారు. గంగినేని గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే వరద ముంపునకు గురై మృతిచెందిన నన్నెబోయి వెంకటేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఇదే గ్రామంలో వరద ముంపు బాధితులకు నిత్యావసరాలను అందజేశారు. గ్రామంలో 150 మంది రైతులకు ప్రభుత్వం అందించిన 7.5 టన్నుల పశువుల దాణాను పంపిణీ చేశారు. అనంతరం తెల్లదేవరపాడు, సున్నంపాడు, మునగ పాడు, చెర్వుమాధవరం, గడ్డమణుగు గ్రామాల్లో పులివాగు వరద ఉధృతికి ధ్వంసమైన రహదారులు, వరి, పత్తి పైరులను పరిశీలించారు. చిన్న నందిగామ గ్రామంలో చెరువుకు పడిన గండ్లను పరిశీలించారు. గండ్లను వెంటనే పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మైలవరం నియోజకవర్గంలో వరద ముంపు బారిన పడిన 60 వేల బాధిత కుటుంబాలకు నిత్యావసరాల కిట్‌లను అందజేశామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గంగినేని గ్రామంలో పశువుల దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

రైతుబజారు షాపుల కేటాయింపులో వివాదం

రైతులు, ఈఓ మధ్య వాగ్వాదం

మైలవరం: మైలవరం రైతుబజారులో షాపుల కేటాయింపులో కూరగాయల రైతులకు, రైతు బజారు ఎస్టేట్ అధికారి చిట్టిబాబుకు మధ్య శనివారం వివాదం జరిగింది. నూతనంగా నిర్మించిన షాపులలో తమకే ముందు భాగంలోని షాపులు కేటాయించాలని కూరగాయల రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే సొసైటీ షాపులకు ముందు వరుసలో ఇస్తున్నట్లు ఈఓ చెప్పడంతో వివాదం నెలకొంది. మైలవరం రైతుబజారులో మొత్తం 60 షాపులను నిర్మించారు. వాటిలో 36 షాపుల్లో వ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 9 సొసైటీ షాపుల్లో 20 రకాల కూరగాయలు అమ్ముతుండగా రైతులకు కేటాయించిన షాపుల్లో 5, 6 రకాలు కూరగాయలు మాత్రమే విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో కూరగాయలు అమ్ముకునే రైతులు తాము 5, 6 రకాలు అమ్మడం వలన తమకు వ్యాపారం జరగడం లేదని, అందువలన కాంప్లెక్స్ ముందు భాగంలో షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనితో ఈఓ చిట్టిబాబు ఈ వివాదాన్ని సోమవారానికి వాయిదా వేశారు. ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది.



ఈఓ చిట్టిబాబు, కూరగాయల రైతుల మధ్య వాగ్వాదం

ప్రజలు సుభిక్షంగా ఉండాలి



నూజివీడులో వినాయకుడిని దర్శించుకుంటున్న మంత్రి పార్థసారథి



మైలవరం రెడ్ల బజారు నుంచి నిమజ్జనానికి తరలి వెళుతున్న గణనాథుడు

నూజివీడు: ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి కొలుసు పార్థసారథి విఘ్నేశ్వరుడిని కోరుకున్నారు. నూజివీడు మండలం మీర్జాపురం, పట్టణంలోని ఆర్ఆర్‌పేటలో గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి శనివారం మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూ వేలం వేయగా వచ్చిన నగదును విజయవాడ వరద బాధితుల సహాయార్థం వెచ్చించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

- మైలవరం: మైలవరం పొందుగల రోడ్డులోని రెడ్ల బజారులో వేపచెట్టు వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు శనివారం నిమజ్జనానికి తరలి వెళ్లాడు. చిన్నారులు ఆనందంతో చిందులు వేశారు. అనంతరం మండలంలోని వెల్వడం గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు.ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక ఆకులవారి బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి పందిరి వద్ద తిరువూరు సీఐ కె. గిరిబాబు, ఎస్ఐ రామకృష్ణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు భోజనం వడ్డించారు. స్థానిక భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జనాలు నిర్వహించారు. చనుబండ, పర్వతాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను తీన్మార్ డప్పు వాయిద్యాలతో ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.
- తిరువూరు: రాజుపేట ఏడీబీ సెంటర్‌లో మహిళలు సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. పలు చోట్ల నవరాత్రి ఉత్సవ పందిళ్లలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

లోక్ అదాలత్‌లో 197 కేసుల పరిష్కారం



తిరువూరు కోర్టులో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు



మైలవరం లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి శైలజ, న్యాయవాదులు

తిరువూరు: తిరువూరు, మైలవరంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 197 కేసులు పరిష్కారమయ్యాయి. తిరువూరు కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్, అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సిందూర అదాలత్‌లో రాజీ చేసుకోదగిన 15 సివిల్ కేసులను, 56 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. జడ్జి మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకదాని లక్ష్మీనారాయణ, గౌసుద్దీన్, ఏపీపీ బడేమియా, సీనియర్ న్యాయవాదులు సంకురాత్రి జనార్దనరావు, అత్తునూరి ప్రభాకరరెడ్డి, ముత్యప్రసాద్, రేగళ్ల మోహన్‌రెడ్డి, పల్లెపాటి శ్రీనివాసరావు, మేకల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- మైలవరం: రాజీ పడేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులు పరిష్కారం చేసుకుని కక్షిదారులు సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని జడ్జి ఎం. శైలజ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మైలవరం కోర్టులో శనివారం నిర్వహించారు. జడ్జి శైలజ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 126 కేసులు పరిష్కారమయ్యాయని చెప్పారు. మైలవరం కోర్టు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి వీటీ కిశోర్, సీనియర్ న్యాయవాదులు ఎస్‌వీకే సత్యనారాయణరావు, పజ్జూరు రామకృష్ణ, బుద్దవరపు వెంకట్రావు, ఎం. శరత్‌బాబు, ఎం. తనూజ్, మైలవరం కోర్టు సూపరింటెండెంట్ రంగనాయక్, మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం ఎస్ఐలు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం పరిశీలన

ఆగిరిపల్లి: పశువులకు అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం సీతారాంపురంలో పశు వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం మేకల పెంపకందారులకు దాణా పంపిణీ చేశారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజ భాష అయిన హిందీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ద్వితీయ భాషగా అమలు చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా హిందీ భాషలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తిరువూరు: హిందీభాష ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని తిరువూరు మండలం మునుకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి. వీరభద్రరావు సూచించారు. శుక్రవారం జాతీయ హిందీ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు హిందీలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, పోలిశెట్టిపాడు హైస్కూల్లో కూడా హిందీ దివస్ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

దాతల సహకారంతో రహదారికి మరమ్మతులు

మైలవరం: భారీ వర్షాలు, వరదలకు మైలవరం సెంటర్ నుంచి విజయవాడ వైపునకు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను దాతల సహకారంతో స్థానిక నాయకులు కఠారి ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో పూడ్చివేశారు. ట్రాక్టర్ల సహాయంతో సమీపంలోని క్రషర్ నుంచి కంకర డస్ట్ సేకరించి రహదారిలోని గుంతలను పూడ్చించారు. ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించిన స్థానిక నాయకులు కఠారి ఉమామహేశ్వరరావును పలువురు అభినందించారు.

ఎస్ఐ శుభశేఖర్ బాధ్యతల స్వీకారం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ఎస్ఐగా శనివారం శుభశేఖర్ బాధ్యతలు చేపట్టారు. పెదపాడు నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకూ ఎస్ఐగా పనిచేసిన సురేంద్ర కుమార్‌ను అధికారులు వీఆర్‌కు బదిలీ చేశారు

దుప్పట్ల పంపిణీ

జి.కొండూరు: జి.కొండూరు బీసీ కాలనీలో వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు వారు అందించిన దుప్పట్లను విజయవాడ సిటీ కో–ఆర్డినేటర్ బట్టపర్తి అనిత శనివారం పంపిణీ చేశారు. బాధితులను ఆదుకోవడంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ముందుంటుందని ఆమె చెప్పారు.

సాయం కోసం ఎదురుచూపులు



జక్కంపూడి(విజయవాడరూరల్): పాముల కాల్వ నుంచి జక్కంపూడి గ్రామం వైపునకు వెళ్లే మార్గంలో సుమారు 15 కుటుంబాల వారు ఇటీవల వచ్చిన బుడమేరు వరదకు ముంపునకు గురై సర్వం కోల్పోయారు. వరదలు వచ్చిన వారం రోజుల పాటు పాముల కాల్వ వద్ద వరద నీరు అయిదు అడుగుల నిల్వ ఉండి రాకపోకలు స్తంభించాయి. ఇళ్లకు పడమర వైపు నుంచి బుడమేరు ఉధృతంగా ప్రవహించడం, జక్కంపూడి రోడ్డుపై వరద నిల్వ ఉండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇళ్లల్లోని గృహోపకరణాలు వరదల్లో కొట్టుకుపోయాయని బాధితులు వాపోతున్నారు. వరదలు వచ్చి రెండు వారాలవుతున్నా ఇంతవరకు ఏ అధికారి ఇటువైపు చూడలేదని, ఎటువంటి సహాయం అందజేయలేదని చెప్పారు. ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

మైలవరం: పొందుగల పంచాయతీ శివారు అనంతవరం గ్రామానికి చెందిన పాటిబండ్ల చినబాబు గత పదేళ్లుగా మతిస్థిమితం లేకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అకస్మాత్తుగా ఈ రోజు బయటికి వచ్చి గ్రామస్తులపై దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో కొంత మందికి గాయాలయ్యాయి. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై గ్రామంలోనే పెద్దల (టీడీపీ నాయకుడు బొందలపాటి సుధాకర్)తో చర్చించుకోవాలని పోలీసులు సూచించారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

విస్సన్నపేట: స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం విస్సన్నపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు మనస్పర్ధలతో కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో దుగ్గిరాల వెంకటేశ్వరరావు, కొప్పుల శివకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శివను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవ అమలుకు అధికారుల నియామకం

నూజివీడు: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. నిర్దేశించిన కార్యక్రమాలు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులను ఆయా గ్రామాలకు ఇన్‌చార్జిలుగా నియమించామని వివరించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): స్థానిక ఎంపీపీ పాఠశాలలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు ఇర్ఫాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి సురేష్‌కు కలాం అవార్డు ప్రదానం

ఆగిరిపల్లి: మన హక్కులకై పోరాడు.. సాధించు వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును బెంగళూరులో అందజేశారు. మండలంలోని ఈదరకు చెందిన ఉద్యమ సంస్థ నాయకుడు అయ్యంకి సురేష్‌కు బెంగళూరు నగరంలోని బీఆర్ అంబేడ్కర్ భవనంలో సోమరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

